క్లుప్తంగా

ఔషధాల ప్రభావంపై వర్క్‌షాప్

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ ఫార్మసీ విభాగం ఆధ్వర్యంలో ప్రతికూల ఔషధ ప్రతిచర్యలు, నివారణ అనే అంశంపై జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. స్కూల్ ఆఫ్ ఫార్మసీ అసోసియేట్ ప్రొఫెసర్ పి.లక్ష్మీ ఔషధ ప్రతికూల చర్యలు, గుర్తించే ప్రక్రియ, సమాజంపై వాటి ప్రభావం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు రమ్యకుబేర్, శైలజ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


చిట్టెం లీలా కృష్ణ

తిరుపతి సిటీ: ఎస్వీయూ కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన చిట్టెం లీలా కృష్ణకు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ తెలిపారు. ప్రొఫెసర్ పి.వెంకట సుబ్బారెడ్డి పర్యవేక్షణలో ''ఎఫిషియన్ట్ డీప్ న్యూరల్ నెట్‌వర్క్స్ ఫర్ ది క్లాసిఫికేషన్ ఆఫ్ బ్యాంక్ మార్కెటింగ్ డేటా యూసింగ్ డేటా రిడక్షన్ టెక్నిక్స్'' అనే అంశంపై పరిశోధనా పత్రాలు అందజేశారు.

పరిణయ వస్త్ర ప్రదర్శన ప్రారంభం


కొనుగోలుదారుల సందడి

తిరుపతి కల్చరల్: ఫార్చ్యూన్ కెన్సెస్ హోటల్‌లో ఏర్పాటు చేసిన పరిణయ వస్త్ర ప్రదర్శనను మంగళవారం ప్రారంభించారు. అన్ని రకాల ఆధునాతన డిజైన్లలో శారీలు, బ్లౌసులు, మగువలను ఆకర్షించే జ్యువలరీ లభిస్తాయి. ఈనెల 12వ తేదీ వరకు జరిగే ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు టీవీ.రావు తెలిపారు.

రిటైర్డ్ ప్రొఫెసర్‌కు నివాళి

తిరుపతి సిటీ: ఎస్వీయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం విశ్రాంత ఆచార్యులు జీఎస్ ప్రదీప్ కుమార్ మృతిపై ఆ విభాగం అధ్యాపకులు మంగళవారం సంతాపం తెలిపారు. మృతదేహానికి నివాళులర్పించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.. 1985లో అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి నుంచి ప్రిన్సిపల్ స్థాయికి చేరి వర్సిటీకి సేవలందించారని కొనియాడారు. అధ్యాపకులు ప్రభాకర్, సత్తార్, దామోదర నాయుడు, వెంకటచలపతి, ఆనంద నాయుడు, చిన్నస్వామి నాయుడు, అళహరి పాపారావు, హనుమంతరావు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, మేయర్ శిరీషా



శిబిరంలో రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీషా

తిరుపతి సిటీ: ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని.. అందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, నగర మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. నగరంలోని గాంధీ ట్రస్ట్ భవన్ వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ఏర్పాటు చేశారు. ప్రకాశం రోడ్డు, ఇందిరానగర్, ఎల్‌బీసీ రోడ్డు పరిసరాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నగర మేయర్ శిరీషా, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం క్యాంపులను పరిశీలించారు. తిరుపతి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి వలంటీర్లు, ఆరోగ్య కార్యకర్తలు వచ్చి పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం అన్నారు. ఆరోగ్య సమస్యలు ఎవరికైనా ఉంటే ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. వైద్యం కోసం పేదవారు అప్పుల పాలయ్యే పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత ఆపరేషన్లు చేస్తున్నారని పేర్కొన్నారు. శిబిరంలో పరీక్షలు చేయించుకుని, ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వారికి అవసరమైన చికిత్స అందిస్తామని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ.. మంగళవారం నిర్వహించిన క్యాంపులో 1147 మంది సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. వీరందరికీ జగనన్న ఆరోగ్య సురక్ష కింద ఉచితంగా మందులు పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో వెటర్నరీ ఆఫీసర్ నరేంద్ర రెడ్డి, సూపరింటెండెంట్ రవి, డీఈ రవీంద్ర నాథ్ రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

ఇద్దరు హెల్త్ అసిస్టెంట్లకు బెయిలబుల్ వారెంట్

- వాయిదాకు గైర్హాజర్‌తో న్యాయమూర్తి ఆదేశం

తిరుపతి లీగల్: కోర్టు నుంచి సాక్షి సమన్లు తీసుకుని వాయిదాలకు హాజరు కాకపోవడంతో ఇద్దరు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ అసిస్టెంట్లకు బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. కేసు వివరాల్లోకెళితే... తిరుపతి రూరల్ శానంభట్ల పంచాయతీ, పైడిపల్లెకు చెందిన పి.అశోక్‌కుమార్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ జనన మరణ రిజిస్టర్ విభాగంలో అవుట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అతను రామచంద్రాపురం మండలం, కమ్మకండ్రిగ పంచాయితీ, మిట్టూరుకు చెందిన కె.నాగుల నాయుడు సహకారంతో రికార్డులను తారుమారు చేసి కె.గంగులనాయుడు అనే వ్యక్తి పేరుతో నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని తయారు చేశాడు. తిరుపతి రుయా ఆస్పత్రిలో కె.సిద్ధిక్ సాహెబ్ అనే వ్యక్తి మృతి చెందగా, అతని పేరు తొలగించి కె.గంగుల నాయుడు అనే వ్యక్తి పేరును మరణ ధ్రువీకరణ పత్రంలో చేర్చారు. 1981, ఆగస్టు 15వ తేదీన అధికారులు జారీ చేసినట్లు నకిలీ ధ్రువీకరణ తయారు చేశారు. 2020లో ఈ ఇద్దరిపై తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధారాణి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దీనిపై కేసు నమోదు చేశారు. ఆ కేసు ప్రస్తుతం విచారణలో ఉంది. సాక్షులుగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ అసిస్టెంట్లు ఏ.ఓంప్రకాష్, ఎం.సుబ్రమణ్యం ఉన్నారు. వారిని కేసులో సాక్ష్యం చెప్పాల్సిందిగా కోర్టు నుంచి సమన్లు పంపారు. ఇద్దరూ సమన్లు తీసుకుని సోమవారం కేసు వాయిదాకు హాజరు కాలేదు. దీంతో ఇద్దరినీ బెయిలబుల్ వారెంటుపై కోర్టులో హాజరు పరచాలంటూ ఈస్ట్ పోలీసులను ఆదేశిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. కేసు విచారణను బుధవారానికి వాయిదా వేశారు.

పరిశ్రమల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన

పుత్తూరు రూరల్: స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థులకు పరిశ్రమల నిర్వహణ, పనితీరుపై అవగాహన కల్పించారు. మంగళవారం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు పారిశ్రామిక సందర్శన కార్యక్రమం నిర్వహించారు. నారాయణవనంలోని తసా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి వెళ్లి యంత్రాల పనితీరు, మేనేజ్‌మెంట్ పనితీరును పరిశీలించారు. కంపెనీ మేనేజర్ మురుగేశ్ మాట్లాడుతూ కంపెనీ నిర్వహణ, సిబ్బంది పనివిధానం, ప్రభుత్వ ప్రోత్సాహం వంటి అంశాలపై విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. అధ్యాపకుడు తిరుమలయ్య పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు కళాశాలల్లో చదివే పాఠ్యాంశాల్లోని అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అధ్యాపకులు తిరుమలయ్య, దేవకి, వాసవి పాల్గొన్నారు.

అభివృద్ధికి అవరోధంగా బీజేపీ


సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు

తిరుపతి కల్చరల్: తిరుపతి నగర అభివృద్ధికి బీజేపీ అవరోధంగా మారిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. తిరుపతి నగరాభివృద్ధికి టీటీడీ బడ్జెట్‌లో ఒక శాతం నిధులు కేటాయించడాన్ని తప్పుపట్టడం, పారిశుద్ధ్యానికి కార్మికులను కేటాయించడాన్ని బీజేపీ నేతలు విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి నగరానికి రోజుకు రెండు లక్షల మందికిపైగా ప్రజలు వస్తుంటే ఎంతటి ఒత్తిడి ఉంటుందో శాస్త్రీయ పరిశీలన చేస్తే అర్థమవుతుందని తెలిపారు. విద్య, వైద్యం, పారిశుద్ధ్యం వంటి ప్రజాపయోగమైన పనుల నిర్వహణకు టీటీడీ నిధులు వినియోగించాలని యాక్ట్ 30/1987లో స్పష్టంగా ఉన్నా బీజేపీ నేతలు ఎందుకు యాగీ చేస్తున్నారో తిరుపతి ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గరుడ వారధి నిర్మాణానికి బీజేపీ నేత హైకోర్టుకు వెళ్లి ప్రజాగ్రహంతో వెనక్కు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. తిరుపతి అభివృద్ధికి ఖర్చు చేసే నిధులపై వితండవాదం చేయడం తిరుపతి ప్రజలను అవమానించడమేనని తెలిపారు.

సీసీరోడ్డుకు భూమి పూజ


నరసింగాపురంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు

చంద్రగిరి: నరసింగాపురం పంచాయతీలో సీసీ రోడ్డు నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులు మంగళవారం భూమి పూజ చేశారు. నరసింగాపురం ప్రధాన రహదారి మీదుగా గ్రామానికి వెళ్లేందుకు సీసీ రోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి దృష్టికి తీసుకెళ్లామని స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు అశ్విని, ప్రవీణ్ కుమార్ తెలిపారు. దీంతో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సీసీరోడ్డుకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. హరిజనవాడలో చాలా ఏళ్లుగా విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడేవారని, ఎమ్మెల్యే చొరవతో సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. అదే విధంగా గ్రామంలో వాటర్‌ప్లాంట్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

సందడిగా గ్రాండ్ పేరెంట్స్ డే



ముఖ్య అతిథులను సత్కరిస్తున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఎస్వీయూ లేబొరేటరీ నర్సరీ స్కూల్‌లో మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గ్రాండ్ పేరెంట్స్ డే ఘనంగా నిర్వహించారు. పిల్లల అవ్వాతాతలకు మ్యూజికల్ చైర్స్, జ్ఞాపకశక్తి పరిశీలన వంటి పోటీలు నిర్వహించి వినోదంలో వారికి భాగస్వామ్యం కల్పించారు. ముఖ్య అతిథిగా స్విమ్స్ కార్డియాలజీ వైద్యురాలు వనజాక్షమ్మ ఆరోగ్యం, యోగా, మెడిటేషన్ వంటి విషయాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో మంజుల, సుచరిత, అనూరాధ, స్వరూపరాణి, నర్సరీ స్కూల్ టీచర్లు సుదర్శనమ్మ, రాధిక పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన


కంటి అద్దాలను అందిస్తున్న సర్పంచ్ రాగిణిసాగర్

చంద్రగిరి: ప్రతి పల్లెలో వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలకు విశేష స్పందన వస్తోందని జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారిణి శాంతి కుమారి అన్నారు. మంగళవారం చంద్రగిరి మండల పరిధిలోని చిన్నరామాపురం పంచాయతీలో సురక్ష క్యాంపు ఏర్పాటు చేశారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. సుమారు 380 మందికి వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఎంపీడీఓ రమేష్‌బాబు, సర్పంచ్ రాగిణిసాగర్, సూపర్‌వైజర్‌లు నాగమణి, సుభాషిణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

దాడి ఘటనలో భర్తపై కేసు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు పంచాయతీ పరిధి ఎర్రమిట్టలో మద్యం సేవించి భార్యపై దాడి చేసిన ఘటనలో భర్తపై మంగళవారం రాత్రి కేసు నమోదైంది. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు ఎర్రమిట్ట గ్రామానికి చెందిన మునిరాజా, సంధ్య దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మునిరాజా మద్యం సేవించి భార్యను తరచూ వేధిస్తున్నాడు. ఆదివారం మద్యం సేవించి భార్యపై దాడి చేసి గాయపరచాడు. ఆమెను రేణిగుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

పల్లంపేటలో భూ తగాదా ముగ్గురిపై కేసు

ఏర్పేడు: మండలంలోని పల్లంపేటలో భూ తగాదా ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. పల్లంపేటకు చెందిన చంద్రప్ప నాయుడుకు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు ఇద్దరు కుమారులు. ఇరు కుటుంబాల మధ్య చాలా ఏళ్లుగా భూ తగాదా నడుస్తోంది. సోమవారం తండ్రి చంద్రప్ప నాయుడుపై ప్రమీల, తేజతో కలిసి వెంకటేశ్వరరావు దాడి చేస్తుండగా, నాగేశ్వరరావు భార్య శారదతో కలిసి అడ్డుకున్నాడు. ఈ ఘటనలో చంద్రప్ప నాయుడు, శారద గాయపడ్డారు. క్షతగాత్రులను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

13న సత్యవేడులో మెగా జాబ్ మేళా

పిచ్చాటూరు: సత్యవేడులో ఈనెల 13న ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే పిచ్చాటూరు విలేకరులతో మాట్లాడుతూ ఆరోజు ఉదయం 9 గంటలకు సత్యవేడు పాలిటెక్నిక్ కలాశాలలో జరుగనున్న జాబ్ మేళాలో 15 బహుళ జాతి కంపెనీలు పాల్గొననున్నాయన్నారు. 8వ తరగతి/ 10వ తరగతి, ఇంటర్/ఏదైనా డిప్లొమో/ఏదైనా డిగ్రీ/ బీటెక్ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు ఆధార్, 5 బయోడేటా కాపీలు, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.13 వేలు నుంచి రూ.30 వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి 9440374535, 9154449677 నంబర్లను సంప్రదించవచ్చని ఎమ్మెల్యే సూచించారు.

పారదర్శక ఓటర్ల జాబితా తయారీ



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: ఓట్ల తొలగింపు, చేర్పులపై ప్రజల నుంచి వచ్చిన క్లైయిమ్‌ల పరిశీలన జాగ్రత్తగా చేపట్టాలని తిరుపతి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. క్లైయిమ్‌ల పరిశీలన, పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు తదితర అంశాలపై మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారదర్శకమైన ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు అన్ని పార్టీల నాయకులు తమ సిబ్బందికి సహకారం అందించాలని కోరారు. బూత్ లెవెల్ ఆఫీసర్స్‌తో, బూత్ లెవెల్ ఏజెంట్లు సహకరించాలన్నారు. మరణించిన వారి ఓట్ల తొలగింపు, ఓటర్ల చేర్పులు తదితర విషయాల్లో ప్రజల నుంచి వచ్చిన క్లెయిమ్‌ల విషయంలో సిబ్బంది చాలా జాగ్రత్తగా పరిశీలన చేయాలన్నారు. ఇప్పటికే ఇంటింటి సర్వే పూర్తి చేశామని, క్లైమ్‌ల పరిశీలన విషయంలో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, తహసీల్దార్ వెంకటరమణ పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

తిరుపతి సిటీ: పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మహిళలు, పిల్లల చట్టపరమైన రక్షణ అనే అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మహదేవమ్మ మాట్లాడుతూ.. చట్టపరమైన విషయాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. భారత రాజ్యాంగం పిల్లల రక్షణ, స్త్రీల భద్రత, స్వేచ్ఛకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. దీని వెనుక ఎంతో మంది మహిళల కృషి ఉందన్నారు. మహిళలు దిశా యాప్ లాంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా వర్సిటీ లా విభాగాధిపతి మాధురి పరదేశి, అంబేద్కర్ లా కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రభాకరన్, సుధారాణి, జగదీశ్వరి, అధ్యాపకులు రమణ, రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

వ్యాయామంతో మానసిక సమస్యలు దూరం



హాజరైన ఎన్జీఓలు, అధ్యాపకులు

తిరుపతి సిటీ: క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా చేయడం వల్ల మానసిక సమస్యలు దూరం అవుతాయని డీన్ అనురాధ అన్నారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మానసిక దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అనురాధ మాట్లాడుతూ.. ఆటలు, యోగా మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని తెలిపారు. వర్సిటీలోని స్పోర్ట్ అండ్ గేమ్స్, యోగా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలను అవసరం మేరకు వినియోగించుకోవాలని చెప్పారు. మానసిక ఆరోగ్యం దినోత్సవం థీమ్ గురించి వివరించారు. విద్య, ఆర్థిక, ప్రేమ వైఫల్యం వంటి వాటిని అధికమించడానికి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు విద్యావతి, నిర్మల, డాక్టర్ నీరజ, మంజుల పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ



నగదును అందజేస్తున్న మేనేజర్ సుధాకరయ్య, కండక్టర్ వినాయకం

పుంగనూరు: ఓ ప్రయాణికుడు పోగొట్టుకున్న రూ.50వేలను విధి నిర్వహణలో ఉన్న కండక్టర్ గుర్తించి బాధితునికి అప్పగించారు. వివరాలు..పుంగనూరు డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా పని చేస్తున్న వినాయకం తిరుపతి–పుంగనూరు సర్వీసుకు మంగళవారం డ్యూటీకి వచ్చారు. మార్గమధ్యంలో ఓ సీటులో రూ.50వేలు పడి ఉండటం గుర్తించాడు. ఆ నగదును డిపో మేనేజర్ సుధాకరయ్యకు అందజేశారు. తాను ఇచ్చిన టికెట్ల ఆధారంగా ఆ సీటులో కూర్చున్న వ్యక్తి చంద్రగిరికి చెందిన చెంగల్రాయనాయుడుగా గుర్తించారు. ఆయనను పిలిపించి నగదును అందజేశారు. కండక్టర్‌ను డిపో మేనేజర్, బాధితుడు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీసి కార్మిక సంఘ నాయకుడు కరీముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సామర్థ్యాలను పెంచుకోవాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ


పాకాల: విద్యార్థులు సమార్థ్యాలను పెంచుకోవాలని ఎంఈఓ బాబ్జీ అన్నారు. మంగళవారం పోలిశెట్టివారిపల్లి, పచ్చిపాలపల్లి, అగ్రహారం ఎంపీపీ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పిన తరువాత విద్యార్థులతో వర్క్‌బుక్‌ను తప్పనిసరిగా రాయించాలన్నారు. వర్క్‌బుక్ రాసిన తరువాత ఎప్పటికప్పుడు సరిదిద్ది విద్యార్థులు చేసిన తప్పులను తెలియజేయాలన్నారు. ప్రతి రోజు విద్యార్థుల హాజరును స్టూడెంట్స్ అటెండెన్స్ యాప్‌లో నమమో చేయాల్సిన బాధ్యత హెచ్ఎంలపై ఉందన్నారు. విద్యార్థులు రాసిన పరీక్ష ఫలితాలను గ్రేడింగ్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. క్రమం తప్పకుండా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను తెలపాలన్నారు.

మంచి అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ మహదేవమ్మ

తిరుపతి సిటీ: మంచి అలవాట్లు, క్రమశిక్షణ, వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పద్మావతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మహదేవమ్మ అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ప్రపంచ మానసిక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ.. మానసిక రుగ్మతలను తొలగించుకుని ఆరోగ్యంగా ఉండాలంటే అలవాట్లు, క్రమశిక్షణతో పాటు యోగా, వ్యాయామం, మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ కీర్తి, సైకాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్ భద్రమణి పాల్గొన్నారు.



వైభవంగా ఏకాదశి ఉత్సవం



నారాయణవనం: తిరుచ్చిపై స్వామివారి విహారం

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. వేకువజామున సుప్రభాత సేవతో నిత్య కైంకర్యాలను పూర్తి చేశారు. ఏకాదశి గడియల్లో అర్చనలు నిర్వహించి, ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. తమిళ పెరటాశిమాసం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీస్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి తిరుచ్చి వాహనాన్ని అధిష్టించి తిరు వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించారు.



నాగలాపురం: స్వామివారి ఊరేగింపు

శ్రీవేదనారాయణస్వామి ఆలయంలో..

నాగలాపురం: మండల కేంద్రంలోని ప్రముఖ శ్రీవేదవల్లి సమేత వేదనారాయ ణస్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా మంగళవారం విశేష పూజలు చేశారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజల అనంతరం తిరుచ్చిపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు.

రోడ్డుపై దొరికిన ఐ-ఫోన్ పోలీసులకు అప్పగింత



పోలీసుల సమక్షంలో ఫోన్‌ను బాధితుడికి అప్పగిస్తున్న సురేష్

చిత్తూరు అర్బన్: రూ.50 నోటు రోడ్డుపై దొరికితే అటూ ఇటూ చూసి జేబులో పెట్టుకుని వెళ్లిపోయే రోజులివి. అలాంటిది రూ.75 వేల విలువ చేసే ఐ–ఫోన్ దొరికితే..? అయినా సరే ఫోన్ తీసుకొచ్చి పోలీసులకు అప్పగించారు. వివరాలు..చిత్తూరులోని తోటపాళ్యంకు చెందిన సురేష్ గాంధీరోడ్డులోని ఓ బ్యాంకులో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంటికి వెళుతుండగా రోడ్డుపై ఓ ఫోన్ కనిపించింది. దానిని తీసుకుని అక్కడే ఎదురుచూశాడు. ఎవరూ రాకపోవడంతో మంగళవారం ఉదయం మంగళవారం ఉదయం వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డికి ఆ ఫోన్ అప్పగించారు.

అప్పటికే కొంగారెడ్డిపల్లెకు చెందిన భూపతి అనే వ్యక్తి పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. రూ.75 వేల విలువ చేసే ఐ–ఫోన్‌ను తన సోదరి బహుమతిగా ఇచ్చిందని, గణేష్ నిమజ్జన ఉత్సవంలో దీన్ని పోగొట్టుకున్నట్టు బాధితుడు పేర్కొన్నాడు. ఫోన్‌ను సురేష్ చేతుల మీదుగా భూపతికి అందచేశారు. నిజాయితీగా ఫోన్ తీసుకొచ్చి స్టేషన్‌లో అప్పగించడంతో సీఐ, సురేష్‌ను అభినందించారు.



క్లుప్తంగా

ఈఓగా సాగర్‌బాబుకు పూర్తి బాధ్యతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ఈవోగా సాగర్‌బాబుకు ప్రభుత్వం పూర్తి బాధ్య తలు అప్పగించింది. తిరుపతి ఆర్‌జేసీగా విధులు నిర్వహిస్తూ శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ఈవోగా సాగర్‌బాబు అదనపు బాధ్యతలు నిర్వహించారు. తిరుపతి ఆర్‌జేసీగా మరొకరిని నియమించడంతో శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ఈవోగా సాగర్‌బాబు పూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. పాలకమండలి సహకారంతో ఆలయాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

నింద్ర తహసీల్దార్‌గా భగవతి


భగవతి

నింద్ర: మండల తహసీల్దార్‌గా భగవతి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్క డ పని చేస్తున్న తహసీల్దార్ బదిలీపై చిత్తూరుకు వెళ్లారు. దీంతో జిల్లా కేంద్రంలో పని చేస్తున్న భగవతిని నింద్రకు బదిలీ చేశారు.

వేగంగా దేశమ్మ ఆలయ నిర్మాణం

నగరి : నగరి మున్సిపాలిటీ, టీఆర్ కండ్రిగలో నేత్రదేవతగా ప్రసిద్ధి చెందిన దేశమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణం వేగంగా జరుగుతోంది. రూ.1.20 కోట్ల నిధులతో పునర్నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణంలో భాగంగా గోపురం, ముఖమండపం, గర్భగుడి, పోతురాజ ఆలయం పనులు వేగంగా జరుగుతున్నాయి.

టీటీడీ కార్మికుల వేతనాల పెంపుపై హర్షం

తిరుపతి రూరల్/తిరుపతి కల్చరల్: టీటీడీ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులుగా పని చేస్తున్న వారికి వేతనాలు పెంచుతూ సోమవారం టీటీడీ బోర్డు తీసుకున్న నిర్ణయంపై వైఎస్సార్‌టీయూసీ జోనల్ ఇన్‌చార్జ్ రాజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. వేలాది మంది కార్మికుల ముఖాల్లో సంతోషాలను నింపిన టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం తిరుపతి రూరల్ మండలం మల్లంగుంటలోని జోనల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అనేక ఏళ్ల నుంచి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు తక్కువ వేతనంతో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సంక్షేమం కోసం కరుణాకరరెడ్డి ప్రత్యేక చొరవ చూపడం హర్షణీయమన్నారు. రూ.12 వేల నుంచి రూ.17 వేలకు పెంచడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు బీమా కూడా ప్రకటించడం హర్షణీయమన్నారు. మ్యాన్ పవర్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు ఏటా 3 శాతం వేతనం పెంచుతూ నిర్ణయం తీసుకోవడం వల్ల 6600 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. వేతనాల పెంపు నిర్ణయం తీసుకున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు.


భూమన కరుణాకరరెడ్డిని సత్కరిస్తున్న ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ ప్రసాద్

రేపు అర్బన్ హట్‌లో ధన్యవాదాల సదస్సు

టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, పాలకమండలికి ధన్యవాదాలు తెలుపుతూ గురువారం అర్బన్ హట్‌లో వేలాది కార్మికులతో సదస్సు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రరెడ్డి తెలిపారు. సదస్సుకు వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ రాజారెడ్డి హాజరవుతారని తెలిపారు.


విశ్వ హిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి రాఘవులును సత్కరిస్తున్న భూమన

భూమనకు పలువురు సత్కారం

తిరుపతి మంగళం: భూమన కరుణాకరరెడ్డిని ఆయన నివాసగంలో పలువురు సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎంవీ.ప్రసాద్, మాటీవీ మాజీ చైర్మన్ మురళీకృష్ణమరాజు, అఖిల భారత దాసుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ధనంజయరావు, విశ్వ హిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి రాఘవులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఒత్తిడిని జయిస్తేనే విజయం


బాలింతకు బేబీ కిట్ అందిస్తున్న న్యాయమూర్తి సంయుక్త

నాయుడుపేట : మానసిక ఒత్తిడిని జయిస్తేనే జీవితంలో విజయం సాధించగలమని జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి సంయుక్త తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ మానసిక రుగ్మతలతో బాధపడే వారు తొలుత వైద్యులను సంప్రదించాలని సూచించారు. పలువురు విద్యార్థులు ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని కోరారు. ప్రజలకు న్యాయ పరమైన సలహాలు అందించడంతోపాటు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకే న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం మెరుగైన వైద్యసేవలందిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రకళతోపాటు పలువురు డాక్టర్లను ఘనంగా సత్కరించారు. ప్రభుత్వాస్పత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్న బాలింతలకు బేబీ కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీపీ స్వాతి రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్, న్యాయవాదులు వి.పార్థసారథిరెడ్డి, సీహెచ్ కుమార్, పి.చెంగయ్య, షేక్ రఫీ, వైద్యులు అమర్‌నాథ్, వెంకటరత్నం, శ్రీధర్ పాల్గొన్నారు.

పనివేళల్లో కార్యాలయంలో ఉండాల్సిందే


సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: కార్యాలయ పనివేళల్లో సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. తిరుపతి కెనడీనగర్‌లోని 12, 13 వార్డు సచివాలయాలను మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది కొందరు మాత్రమే ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది పనివేళల్లో కచ్చితంగా కార్యాలయాల్లో ఉండాలన్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సమయపాలన, బయోమెట్రిక్ హాజరు, యూనిఫాం తప్పనిసరి అన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం డి అడిక్షన్ సెంటర్‌ను సందర్శించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట హెల్త్ ఆఫీసర్ అన్వేష్ రెడ్డి ఉన్నారు.



భక్తి భావంతో జెండా పండుగ


మాట్లాడుతున్న డీఎస్పీ సూర్యనారాయణ

గూడూరురూరల్ : దసరా సందర్భంగా పట్టణంలో నిర్వహించే జెండా పండుగను భక్తిభావంతో నిర్వహించుకోవాలని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం కోనేటి మిట్టలోని సీఆర్ మార్టులో ఉత్సవ కమిటీతో ఆయన సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పండుగను అత్యంత వైభవంగా జరుపుకోవాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సహకరించాలని కోరారు. జెండా ఉత్సవం జరిగే సమయంలో హోర్డింగ్‌లు అడ్డురాకుండా చూసుకోవాలన్నారు. ఎక్కడ గొడవలు జరిగినా ఉత్సవ కమిటీనే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. జెండా నిలిచే ప్రాంతంలో కమిటీ సభ్యులుగా పదిమంది ఉండాలని, అందరి ఆధార్‌కార్డులు పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వాలని ఆదేశించారు. ఉత్సవానికి 400 పోలీసులతో బందో బస్తు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సీఐలు హజరత్‌బాబు, వెంకటేశ్వరరావు, ఎస్ఐలు పవన్‌కుమార్, కృష్ణమూర్తి, రామారావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



పాకాల: మండల కేంద్రంలోని కమ్మవీధిలో ఇనుప విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానికులు మాట్లాడుతూ.. ఇనుప విద్యుత్ స్తంభం తుప్పు పట్టి కింద భాగం పూర్తిగా దెబ్బతిందని వాపోయారు. స్తంభం విరిగి పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని, అధికారులు స్పందించి త్వరగా విద్యుత్ స్తంభాన్ని మార్చాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఏఈ ప్రశాంత్‌ను వివరణ కోరగా త్వరలోనే విద్యుత్ స్తంభాన్ని మార్చి ఎలాంటి ప్రమాదం జరగకుండా చూస్తామని తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నాగలాపురం: మండలంలోని కారణి ఎంపీపీ పాఠశాల విద్యార్థులు త్రోబాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం విజయకుమా రి తెలిపారు. మంగళవారం విద్యార్థులను పాఠశాలలో ఉపాధ్యాయ బృందం అభినందించింది. హెచ్ఎం మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూ రు జిల్లా అండర్-14 త్రోబాల్ జిల్లా పోటీల్లో 8వ తరగతి విద్యార్థులు కావ్య, విజయలక్ష్మి జిల్లా జట్టు తరపున పాల్గొని విశేష ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.


గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు



సమావేశంలో పాల్గొన్న ఫౌండేషన్ నాయకులు

శ్రీకాళహస్తి: గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మికత కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమరసత సేవా రాష్ట్ర ధర్మప్రచారక్ ముద్దు సాయిరాం తెలిపారు. మంగళవారం పట్టణంలోని శ్రీరామనగర్ కాలనీ సాయిబాబా ఆలయంలో శ్రీకాళహస్తి పట్టణం, మండలం, తొట్టంబేడు, ఏర్పేడు, కేవీబీపురం మండలాల కన్వీనర్లు, మండల కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. సాయిరాం మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడు వేల దేవాలయాల్లో పౌర్ణమి హారతులు జరుగుతున్నాయని, ఏకా దశి సందర్భంగా అన్ని మండలాల్లో నగర సంకీర్తనలు, భజన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.









క్లుప్తంగా

ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌లో సాంకేతికత వినియోగం



విద్యార్థులకు మెమెంటోలు అందజేస్తున్న ఆర్ఎస్ జులనియా

ఏర్పేడు: ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌లో విద్యార్థులు సాంకేతికతను వినియోగించుకోవాలని ఐఏఎస్ అధికారిణి ఆర్ఎస్‌జులనియా సూచించారు. మంగళవారం మండలంలోని మేర్లపాక రెవెన్యూలో ఉన్న తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ ఆధ్వర్యంలో 'పబ్లిక్ పాలసీ ఇన్ ప్రాక్టీస్' అనే అంశంపై వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదరికం, ఆరోగ్యం, సంక్షోభ నిర్వహణ, పాఠశాల, ఉన్నత విద్యలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. వర్క్‌షాప్‌లో విద్యార్థులు భారతదేశం 2047 కోసం తమ విజన్‌ను ప్రదర్శించారు. విజయం సాధించిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఐఏఎస్ అధికారి సుబ్రమణం, ఐపీఎస్ అధికారిణి సంధ్య, ఐఈఎస్ అధికారి వీఎల్‌వీఎస్ఎస్ సుబ్బారావు, వర్క్‌షాప్ అధికారి రాహుల్ ఏ సిరోహి పాల్గొన్నారు.

1 నుంచి చెరువుల్లోకి చేప పిల్లలు

తిరుపతి అర్బన్: జిల్లాలోని అన్ని చెరువులకు నవంబర్ 1వ తేదీ నుంచి చేప పిల్లలను వదిలిపెట్టనున్నట్టు మత్స్యశాఖ జిల్లా అధికారి శ్రీనివాస్‌నాయక్ మంగళవారం తెలిపారు. జిల్లాలో తిరుపతి మత్స్యశాఖ కార్యాలయం వద్దే కాకుండా కళ్యాణ్‌డ్యామ్, అరణియార్ ప్రాజెక్టు వద్ద 1.5 కోట్ల చేప పిల్లలను జాలర్ల సమక్షంలో పెంచుతున్నట్లు వెల్లడించారు. ఇవి పెద్ద చెరువుల్లో వదలడానికి సిద్ధంగా ఉన్నాయని, చెరువులకు నీళ్లు చేరిన వెంటనే వదలొచ్చని చెప్పారు. ముందుగా మత్స్యశాఖ సొసైటీ చెరువులకు.. ఆపై పంచాయతీ రాజ్ చెరువుల్లోకి చేప పిల్లలు వదులుతామన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 68,828 మంది స్వామివారిని దర్శించుకోగా.. 28,768 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.53 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆఫ్‌లైన్‌లో రేషన్ బియ్యం

తిరుపతి అర్బన్: రేషన్ కార్డుదారుల వేలిముద్రలతో పనిలేకుండా ఆఫ్‌లైన్ పద్ధతిలో రేషన్ పంపిణీ చేయాలని పౌరసరఫరాల అధికారి రాజా రఘువీర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాంకేతిక సమస్యలతో సర్వర్ సక్రమంగా పనిచేయని పక్షంలో ఆఫ్‌లైన్‌లో సరుకులు ఇవ్వాలని డీలర్లు, ఎండీయూ వాహనదారులకు స్పష్టం చేశారు. వేలిముద్రలు తీసుకోవడం లేదన్న సాకుతో బియ్యం ఇవ్వకుండా తిరిగి పంపరాదని, ప్రతి డీలర్ ఈ అంశాన్ని పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

దుర్గమ్మ సేవలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి



డిప్యూటీ సీఎంకు అమ్మవారి చిత్రపటం..

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే నారాయణ స్వామి మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ అర్చకులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు.

డబుల్ ధమాకా!

డబుల్ డెక్కర్ బస్సు



డీపీటీఓతో చర్చిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్



ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి నగరంలో డబుల్ డెక్కర్ ఏసీ బస్సు తొలిసారిగా పరుగులు పెట్టనుంది. నగర వాసులకు సరికొత్త అనుభూతిని మిగిల్చేందుకు యంత్రాంగం ప్రణాళిక రచించింది. శ్రీనివాస సేతు ఫ్లైఓవర్, మాస్టర్‌ప్లాన్ రహదారుల మీదుగా ఈ బస్సు రయ్‌మని దూసుకెళ్లనుంది. నగర అందాలను వీక్షించేలా.. పర్యాటకులు పరవశించేలా తమవంతు సేవలు అందించనుంది. ఇప్పటికే ఈ–బస్సు సేవలతో భక్తులను ఆకట్టుకుంటున్న అధికారులు.. ఇప్పుడు మరో కొత్త సర్వీసును తీసుకొచ్చి సరికొత్త అనుభూతిని కల్పించేందుకు సిద్ధమవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

- తిరుపతికి తొలి డబుల్ డెక్కర్ బస్సు
- రేపటి నుంచి పరుగులు
- నాలుగు మార్గాల్లో సర్వీసు తిప్పేలా ప్రణాళికలు
- ఇప్పటికే ట్రయల్ రన్ పూర్తి

ఏ మార్గంలో ఎక్కడి నుంచి ఎక్కడి వరకంటే

రూట్ 1: కరకంబాడి రోడ్డు అన్నమయ్య ఇంజినీరింగ్ కళాశాల– శ్రీపద్మావతి మహిళా వర్సిటీ (మంగళం, లీలామహల్ కూడలి, పూర్ణకుంభం సర్కిల్, రామానుజకూడలి, లక్ష్మీపురం, అన్నమయ్య సర్కిల్, ఎమ్మార్‌పల్లి కూడలి నుంచి నూతనంగా నిర్మించిన సీతమ్మరోడ్డు మీదుగా మహిళా వర్సిటీ వరకు)

రూట్ 2: మహిళా యూనివర్సిటీ–ఎస్వీ యూనివర్సిటీ (సీతమ్మరోడ్డు, దండి సర్కిల్, అన్నమయ్య సర్కిల్, రామానుజ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, గ్రూప్‌థియేటర్స్, తాతయ్యగుంట ఆలయం, ఓల్డ్ మున్సిపల్ కార్యాలయం కూడలి, వీవీమహల్ రోడ్, టీటీడీ ఏడీ బిల్డింగ్, నందిసర్కిల్, గరుడ సర్కిల్, టౌన్‌క్లబ్ సర్కిల్, బాలాజీ కాలనీ, ఎస్వీ యూనివర్సిటీ మెయిన్‌గేట్)

రూట్ 3 : ఎస్వీ యూనివర్సిటీ మెయిన్‌గేట్–తిరుచానూరు (బాలాజీ కాలనీ, టౌన్ క్లబ్‌సర్కిల్, అలిపిరి, కపిలతీర్థం సర్కిల్, శ్రీనివాససేత మీదగా తిరుచానూరు)

రూట్ 4 : తిరుచానూరు– అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల(శిల్పారామం, శ్రీనివాస కల్యాణ మండపం, రామానుజ సర్కిల్, పూర్ణకుంభం సర్కిల్, లీలామహల్ సర్కిల్, మంగళం రోడ్డులోని బొంతాలమ్మ ఆలయం, మంగళం)

సర్వీస్	డబుల్ డెక్కర్ ఏసీ బస్సు
నడిచే విధానం	ఎలక్ట్రికల్ బ్యాటరీ
ఖర్చు	రూ.2.7 కోట్లు
నిర్వహణ	తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్
బస్సు నడిపే మార్గాలు	నాలుగు
సీటింగ్ కెపాసిటీ	68
ట్రైనీ డ్రైవర్లు	ముగ్గురు

తిరుపతి తుడా : తిరుపతి నగరం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. రహదారుల విస్తరణతో నగరం కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ క్రమంలో నగర వాసులు, యాత్రికులకు స్మార్ట్ సౌకర్యాలను కల్పించే ఉద్దేశంతో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి స్మార్ట్ రవాణా సదుపాయంపై దృష్టి సారించారు. అత్యాధునిక సౌకర్యాలతో తొణికిసలాడుతున్న ఎలక్ట్రికల్ బ్యాటరీ డబుల్ డెక్కర్ బస్సును తీసుకురావాలని సంకల్పించారు. గత మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌లో డబుల్ డెక్కర్ బస్సు ప్రతిపాదనకు కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేయగా.. నిపుణులతో సుదీర్ఘంగా చర్చించి డబుల్ డెక్కర్ బస్సును ఇటీవల కొనుగోలు చేశారు.



డబుల్ డెక్కర్ బస్సును ఆసక్తిగా తిలకిస్తున్న జనం

పరుగులు పెట్టనున్న స్మార్ట్ బస్సు

ఎలక్ట్రికల్ బ్యాటరీ డబుల్ డెక్కర్ బస్సు ఈనెల 12వ తేదీ నుంచి తిరుపతి నగరంలో పరుగులు పెట్టనుంది. ఇప్పటికే రెండు పర్యాయాలు బస్సు నడిపే మార్గాల్లో ట్రయల్ రన్‌ను విజయవంతంగా పూర్తిచేశారు. కమిషనర్ హరిత, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డితో పాటు ఇంజినీర్లు, కార్పొరేటర్లు ట్రయల్ రన్‌లో పాల్గొన్నారు. నాలుగు మార్గాల్లో ఈ బస్సును నడపనున్నారు. ఆయా మార్గాల్లో ఇప్పటికే రూట్‌ను క్లీయర్ చేశారు.

పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట

తిరుపతి నగరంలో పర్యావరణ పరిరక్షణకు మున్సిపల్ కార్పొరేషన్ నడుం బిగించింది. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలను అనుసరిస్తూ ఉత్పత్తయ్యే చెత్త నిర్వహణ మొదలు.. ప్లాస్టిక్ నిషేధం, ఉద్యోగులకు వంద ఈ స్కూటర్లు, పచ్చదనం పెంపు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి వంటి వాటిని విజయవంతంగా నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే ఎలక్ట్రికల్ బ్యాటరీ బస్సును నడపాలని నిర్ణయించింది. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకోవడం, నగరవాసులకు కొత్త అనుభూతిని తీసుకురావడమే లక్ష్యంగా మోడ్రన్‌బ్యాటరీ బస్సును ప్రవేశ పెట్టింది.

వారం రోజుల పాటు ఉచితం



తిరుపతి నగరం స్మార్ట్‌గా అభివృద్ధి చెందుతోంది. రహదారుల అభివృద్ధి, ఫ్లైఓవర్, రోడ్ల విస్తరణతో పాటు నగరవాసులకు ఆధునిక మౌలిక వసతులను కల్పించడంపై దృష్టి సారించాం. డబుల్ డెక్కర్ బస్సు సేవలు వారం రోజుల పాటు ఉచితం. ఆపై నిర్దేశించిన టికెట్ల ధరలతో నడపుతాం.

– భూమన అభినయ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ తిరుపతి

సర్వీసు నిర్వహణకు ఏర్పాట్లు



డబుల్ డెక్కర్ ఏసీ బస్సుతో నగరంలో రవాణా సౌకర్యాలను కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. నాలుగు మార్గాలను ఎంపిక చేశాం. నిర్దేశించిన ఆయా మార్గాల మీదగా ఈ బస్సు పర్యటించనుంది. ఇప్పటికే శిక్షణ ఇచ్చిన ముగ్గురు డ్రైవర్లు సిద్ధంగా ఉన్నారు.

– డీ.హరిత, కమిషనర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్

మేలు జాతి పేయదూడలను అభివృద్ధి చేద్దాం



మేలుజాతి దూడలను ఎంపిక చేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

పెనుమూరు(కార్వేటినగరం) మేలుజాతి దూడలను అభివృద్ధి చేసి, పాల దిగుబడిని పెంచేందుకు కృషి చేద్దామని పశు సంతతి పరిశీలనా కేంద్రం సంచాలకులు డాక్టర్ వాసు అన్నారు. మంగళవారం మండలంలోని కామచిన్నయ్యపల్లెలో మేలు జాతి దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాసు మాట్లాడుతూ విశిష్ట లక్షణాలు కలిగి, అధిక పాల దిగుబడినిచ్చే మేలు జాతి దూడలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పీటీపీ సెమెన్ ద్వారా మేలు జాతి కోడె దూడలు, అలాగే మేలు జాతి పేయదూడలను గత మూడేళ్లుగా అభివృద్ధి చేస్తున్నామని, రైతులు తమ ఆవులకు పీటీపీ సెమెన్ వేయించుకోవడం ద్వారా మంచి లక్షణాలు గల పేయ, కోడెదూడల సంతతి పెరిగే అవకాశం ఉందని, పాడి రైతులు సహకరించాలన్నారు. ఈ ప్రదర్శనలో భాగంగా ఉత్తమ పాడిరైతులుగా వరలక్ష్మి, ఉమాపతి నాయుడు, రుక్మాంగధ నాయుడుకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 70 మంది రైతులకు కూడా ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ గీతారెడ్డి, మండల పశువైద్యాధికారి డాక్టర్ పార్తీబన్, ఏహెచ్‌ఏలు దీపిక, లిఖిత, గోపాలమిత్రలు గీత, శర్మ, గోపాల్ పాల్గొన్నారు.

పెంకాక్ సిలాట్ క్రీడలో కార్వేటినగరం విద్యార్థులకు స్వర్ణం

కార్వేటినగరం: కేరళలోని త్రివేంద్రం జమ్మీజార్జ్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల ఒకటి నుంచి 3వ తేదీ వరకు నిర్వహించిన పెంకాక్ సిలాట్ సౌత్‌జోన్ చాంపియన్ షిప్‌లో కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. మంగళవారం స్వర్ణ పతకాలు అందుకున్న విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు కళాశాల ఉపాధ్యాయులు చేయూత నందించి, ప్రోత్సాహిస్తున్నారన్నారు. తమ కళాశాలలో బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్) మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.గౌతమ్, డి.లోకేష్‌ను ప్రతి విద్యార్థిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ విద్య అధ్యాపకులు జోగి ప్రసాద్, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సీఎస్ లత, అధ్యాపకులు లావణ్య పాల్గొన్నారు.

నిరంతరం మెరుగైన విద్యుత్ సరఫరా

- సబ్సిడీ ఏటా రూ.500 కోట్లు
- వ్యవసాయ సరఫరా లైన్‌కు రూ.5 వేల కోట్లు
- సీఎండీ సంతోషరావు



మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా ఇస్తున్నామని ట్రాన్స్‌కో సీఎండీ సంతోషరావు తెలిపారు. మంగళవారం చిత్తూరులోని విద్యుత్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పలు రకాల సబ్సిడీ రూపంలో ఎస్సీ, ఎస్టీ, క్షురకులు, స్వర్ణకారులు ఇతర సర్వీసులకు ఉచిత విద్యుత్ సరఫరా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం డిస్కమ్(రాయలసీమ, నెల్లూరు జిల్లాలు)పరిధిలో ఏటా రూ.500 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. అలాగే డిస్కమ్ పరిధిలోని వ్యవసాయ సర్వీసులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద పనులు ప్రారంభించారన్నారు. రూ.5 వేల కోట్లతో వ్యవసాయానికి ప్రత్యేకంగా లైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటి ద్వారా గ్రామాల్లో త్రీఫేజ్ సరఫరా అందించనున్నట్లు తెలిపారు. స్మార్ట్ మీటర్ల వాడకంతో లైన్‌లాస్ తెలుస్తుందన్నారు. దీంతో రైతులకు జవాబుదారీతనం వస్తుందన్నారు. వ్యవసాయ సర్వీసులకు కరెంటు బిల్లులు కట్టాలనే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దన్నారు. జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు వేగంగా చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ హౌసింగ్ పథకం కింద ఇళ్ల నిర్మాణాలకు రుణం పొందినవారికి ఉచితంగా సర్వీసులు ఇస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఉచిత సర్వీసులతోపాటు ఫ్యాన్, ఎల్ఈడీ బల్బులు, ట్యూబ్‌లైట్ ఇవ్వనున్నామని చెప్పారు. నూతన వ్యవసాయ సర్వీసులకు డబ్బులు కట్టిన నెలలోపు విడుదల చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. 48 గంటల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు చేయాలన్నారు. విద్యుత్తు సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీజీఎంలు ధర్మజ్ఞాని, గురవయ్య, ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈలు హరి, పద్మనాభపిళ్లై, రవికుమార్, డీఈలు శేషాద్రి, జయప్రకాష్, సతీష్, ఆనంద్, సుబ్రమణ్యం, కొండయ్య, శ్రీలక్ష్మి, ఏఏఓ గీత, జేఏఓ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఏఏసీ బృందం పరిశీలన



మాట్లాడుతున్న ఎన్‌ఏఏసీ బృందం సభ్యులు

నాయుడుపేట: ఎన్ఏఏసీ గుర్తింపు కోసం నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ బృందం సభ్యులు పరిశీలించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం ఉపకులపతి ఆచార్య విమల, మీరట్ విశ్వవిద్యాలయానికి చెందిన చౌదరి చరణ్‌సింగ్, ఆచార్య శ్రీనివాసరాఘవన్, భారతి, ఆచార్య శ్రీధర్ శెట్టి తదితరులు కళాశాలలో పలు అంశాలపై ఆరాతీశారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, జేకేజీ తదితర విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదనశర్మ మాట్లాడుతూ కళాశాల మంచి గ్రేడ్ పొందగలదని ఆశిస్తున్నట్టు తెలిపారు.

పంచాయతీల సుస్థిర అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి

పలమనేరు/గంగవరం: పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని పంచాయతీల అభివృద్ధికి కృషి చేద్దామని చిత్తూరు జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి సూచించారు. పట్టణ సమీపంలోని మదర్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాలలో పీడీఐ(పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్)పై డివిజనల్ కమిటీ మోనిటరింగ్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల సుస్థిర అభివృద్ధికి నిర్దేశించుకున్న లక్ష్యాలను పూర్తి చేసి, ఆ వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామీణ స్థాయిలో సుస్థిర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం విధివిధాలను రూపొందించిందన్నారు. గ్రామాల్లో పేదరిక నిర్మూలన, ఆరోగ్యకర జీవనం, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, సామాజిక భద్రత, మౌళిక వసతులు తదితర అంశాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి మండల, నియోజకవర్గ, డివిజన్, జిల్లాస్థాయి సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. డివిజినల్ స్థాయిలో మానిటరింగ్ కోసం డీఎల్‌పీఓ చైర్మన్ డివిజనల్ అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. మండల స్థాయిలో డేటా వ్యాలిడేషన్ కమిటీకి చైర్మన్‌గా సంబంధిత ఎంపీడీఓలు వ్యవహరిస్తారన్నారు. పంచాయతీల వారీగా సేకరించిన సమాచారాన్ని సంబంధిత డిజిటల్ అసిస్టెంట్లు ఆయా పోర్టల్ల ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇదే కాపీని ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలన్నారు. దీని ద్వారా వారు గ్రామసభలో ఆమోదం తెలుపాల్సి ఉంటుందన్నారు. ఆపై బ్లాక్‌లెవెల్ ఆమోదం జరుగుతుందని తెలిపారు. గ్రామస్థాయిలో వివరాలు ఈనెల 12వ తేదీలోపు, ఆపై వ్యాలిడేషన్ ప్రక్రియ ఈనెల 25లోపు జరిగి మొత్తానికి ఇందుకు సంబంధించిన పూర్తి సర్వే ఈనెలాఖరుకు పూర్తి కావాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డీపీఓ లక్ష్మి, పలమనేరు ఆర్డీఓ శివయ్య, డీఎల్‌పీఓ ఉమావాణి, డిస్ట్రిక్ కోఆర్డినేటర్ షణ్ముగం పాల్గొన్నారు.

బోయకొండలో 15 నుంచి దసరా ఉత్సవాలు



ఆలయంలో క్యూలైన్ల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న ఈఓ చంద్రమౌళి, పెద్దిరెడ్డి తదితరులు



అమ్మవారి సేవలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తదితరులు

చౌడేపల్లె: మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయంలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు దసరా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ చంద్రమౌళి తెలిపారు. మంగళవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డితో కలిసి ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లు, అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. రూ.2 కోట్ల వ్యయంతో జరుగుతున్న యాగశాల, అర్చకులు, సిబ్బంది వసతి గృహం, అమ్మవారికి జంతు బలులు సమర్పించేందుకు ఏర్పాటు చేసిన మండపం పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. దసరా మహోత్సవాల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడానికి వస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు తీసుకోవాల్సిన ఏర్పాట్లు, వసతులు, కార్యాచరణపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోయకొండలో పూర్తి చేసిన అభివృద్ధి పనులను మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించనున్నట్లు చెప్పారు. రద్దీకి తగిన విధంగా చర్యలు తీసుకోవడంతోపాటు నిత్య ప్రసాదం పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారిని పెద్దిరెడ్డి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సోమల మల్లికార్జునరెడ్డి, రవిచంద్రారెడ్డి, లడ్డు రమణ, సురేంద్రరెడ్డి, డిష్ సూరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఎల్ రెడ్డి, మంజునాథ్, సురేంద్రరెడ్డి, వీర కుమార్ పాల్గొన్నారు.





